

విద్యాపీఠాన్ని సందర్శించిన ప్రభూజీ
తెనాలిటౌన్: గంగానమ్మపేటలోని విద్యాపీఠాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని శ్రీ సాయిధామ పీఠాధీశ్వరులు రామానంద ప్రభూజీ సందర్శించారు.



కార్తికేయుని సేవలో..
మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని విశ్రాంత ఐఏఎస్ అధికారి ఏకే అశ్వనీ కుమార్ ఫరీదా కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు.



శారదాపీఠాధిపతితో ఈఓ
విజయవాడ : విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతిని శుక్రవారం వైజాగ్‌లో దుర్గగుడి ఈవో రామారావు కలిశారు. అమ్మవారి ప్రసాదాలు, పండ్లు సమర్పించారు.

న్యూస్‌రీల్

గుంటూరు రేంజ్‌లో ఇద్దరు సీఐల బదిలీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్‌లో ఇద్దరు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు పశ్చిమ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ (పీఎస్) సీఐగా విధులు నిర్వహిస్తున్న పి.అక్కేశ్వరరావుని బాపట్ల జిల్లాలోని మార్టూరు సర్కిల్ పీఎస్‌కు, గుంటూరు జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ సెల్ సీఐ కుమ్మరి శ్రీనివాసరావుని గుంటూరు పశ్చిమ ట్రాఫిక్ పీఎస్‌కు బదిలీ చేశారు.

రేపు సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక

నకరికల్లు: ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ ఖోఖో జట్ల ఎంపిక ఆదివారం నిర్వహించనున్నట్లు ఖోఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింతా పుల్లయ్య శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నరసరావుపేటలోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల న్యూ క్యాంపస్‌లో మధ్యాహ్నం 2 గంటలకు సెలక్షన్స్ ప్రారంభమవుతాయని తెలిపారు. సీనియర్ బాలబాలికలు సెలక్షన్స్‌కు హాజరుకావచ్చన్నారు. వయస్సుతో నిమిత్తం లేదని అడ్రస్ ధ్రువీకరణ కోసం ఆధార్‌కార్డు వెంట తెచ్చుకోవాలని అన్నారు. ఎంపికైన జట్లు డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు మార్కాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని పేర్కొన్నారు. వివరాలకు కె.ఆదిబాబు, 9985373066ను సంప్రదించవచ్చన్నారు.

జలజీవన్ మిషన్, జగనన్న గృహ నిర్మాణాలపై సమీక్ష



గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రామీణ నీటి సరఫరా–పారిశుధ్య శాఖ ఇంజినీర్లతో శుక్రవారం జలజీవన్ మిషన్, జగనన్న గృహ నిర్మాణాలపై ఆర్‌డబ్ల్యూఎస్‌అండ్ ఎస్ ఇంజినీర్ ఇన్ చీఫ్ ఆర్వీ కృష్ణారెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జెడ్పీ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయా కార్యక్రమాల ప్రగతిపై ఇంజినీర్లతో చర్చించారు. నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో గుంటూరు జిల్లా ఎస్ఈ ఆర్.సురేష్, పల్నాడు డీఆర్ఈ ఆర్ఎస్ఆర్ సురేష్, ఇంజినీర్లు పాల్గొన్నారు.

రేపు బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు స్థానిక ఎన్జీఓ క్లబ్‌లో జిల్లా స్థాయి సీనియర్ మెన్, ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి ఇ.శివశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసి వచ్చేనెల 8 నుంచి 10 వరకు అనంతపూర్ జిల్లా రాప్తాడు మండలం గొల్లపల్లి గ్రామంలో జరగబోయే రాష్ట్ర పోటీలకు పంపిస్తామన్నారు. వివరాల కోసం 93969 90666 సంప్రదించాలన్నారు.

నేడు కుల గణన సర్వేపై ప్రత్యేక సమావేశం

నెహ్రూ నగర్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించతలపెట్టిన కులగణన సర్వేపై శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, స్టాక్ హోల్డర్స్‌తో రెవెన్యూ కల్యాణ మండపంలో అభిప్రాయ సేకరణ, సూచన నిమిత్తం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎస్సీ వెల్ఫేర్ డీడీ మధుసూదన్‌రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరవుతారని వివరించారు.

యార్డులో 26,755 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 26,425 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,755 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,800 నుంచి రూ.23,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 24,100 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.15,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.11,000 నుంచి 27,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.7,000 నుంచి రూ.12,800 వరకు ధర పలికింది. యార్డులో ఇంకా 8,772 బస్తాల మిర్చి నిల్వ ఉంది.

జెడ్పీ ప్రగతి పద్దు

- రూ.87.97 కోట్లతో జిల్లా పరిషత్ బడ్జెట్ ప్రతిపాదనలు
- ప్రణాళిక–ఆర్థిక స్థాయీ సంఘంలో ప్రాథమిక ఆమోదం
- వచ్చే సర్వసభ్య సమావేశంలో సమగ్ర చర్చ
- జెడ్పీలో భేటీ అయిన ఏడు స్థాయీ సంఘాలు



జెడ్పీలో స్థాయీ సంఘ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.87.97 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు శుక్రవారం ప్రవేశ పెట్టారు. చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన భేటీ అయిన ప్రణాళిక–ఆర్థిక స్థాయీ సంఘంలో ప్రతిపాదనలపై చర్చించి ప్రాథమిక ఆమోదం తెలిపారు. శుక్రవారం జెడ్పీ కార్యాలయంలో ఏడు స్థాయీ సంఘాలు భేటీ అయ్యాయి. వీటిలో ప్రణాళిక–ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, విద్య–వైద్యం, అభివృద్ధి పనులకు సంబంధించిన 1, 2, 4, 7వ స్థాయీ సంఘాల సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరిగాయి. వ్యవసాయంపై 3వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్మన్ శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, స్త్రీ–శిశు సంక్షేమంపై 5వ స్థాయీ సంఘం తెనాలి జెడ్పీటీసీ పిల్లి ఉమా ప్రణతి, సాంఘిక సంక్షేమంపై 6వ స్థాయీ సంఘం జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ బత్తుల అనురాధ అధ్యక్షతన జరిగాయి. సమావేశాలకు సంఘాల సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

రూ.55.01 లక్షల మిగులు

వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.87.97 కోట్లతో ప్రతిపాదించిన బడ్జెట్‌లో ఖర్చులను రూ.87.42 కోట్లుగా చూపిన అధికారులు, రూ.55.01 లక్షలు మిగులుగా చూపించారు. ఇదిలా ఉంటే ప్రస్తుత సంవత్సరానికి సంబంధించిన సవరణ బడ్జెట్‌లో రాబడులు, ఆదాయాన్ని రూ.76,12,61,000గా ఖరారు చేసిన పాలకవర్గం వ్యయం, ఖర్చులను రూ.75,61,28,000గా చూపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం జెడ్పీ బడ్జెట్ ప్రతిపాదనలకు ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖల ఖర్చులనూ కలిపి ఆమోదించాల్సి ఉన్నందున రూ.781 కోట్లను కొత్తగా చేర్చారు. దీంతో మొత్తం వార్షిక బడ్జెట్ రూ.869 కోట్లకు చేరింది. ఇందులో కేవలం జెడ్పీకి సంబంధించిన ఆదాయ, వ్యయాలను పరిగణనలోకి తీసుకుని రూ.87.97 కోట్లతో సిద్ధం చేసిన ప్రతిపాదనలను ప్రణాళిక–ఆర్థిక స్థాయీ సంఘం ప్రాథమికంగా ఆమోదిస్తూ వచ్చే జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సమగ్రంగా చర్చించేందుకు నిర్ణయించింది.

15వ ఆర్థిక సంఘ నిధుల కోసం నిరీక్షణ

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు వెచ్చించేందుకు 15వ ఆర్థిక సంఘం ద్వారా కేంద్ర నిధుల కోసం జెడ్పీ పాలకవర్గం ఎదురు చూస్తోంది. ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులను పొందుపర్చారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.40 కోట్లుగా చూపిన అధికారులు వచ్చే ఆర్థిక సంవత్సరానికి రూ.45 కోట్లు రావచ్చునని అంచనా వేశారు. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ గ్రాంట్ల రూపంలో నిధులు వస్తాయని అంచనాలు వేశారు.

మూడు జిల్లాల డీఈఓలు, ఆర్జేడీ గైర్హాజరుపై ఆగ్రహం

విద్య–వైద్యంపై జరిగిన స్థాయీ సంఘ సమావేశానికి మూడు జిల్లాల డీఈఓలతోపాటు ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు గైర్హాజరు కావడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి అధికారులు గైర్హాజరుకావడం తగదని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంగళాయపాలెం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంను అకారణంగా సస్పెండ్ చేశారని లక్ష్మణరావు ఆరోపించారు. విద్యాశాఖాధికారుల గైర్హాజరుపై చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. గుంటూరు జోన్ ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు గుంటూరులో అందుబాటులో ఉండటం లేదన్నారు.

మధ్యలో వెళ్లిపోయిన జెడ్పీటీసీ గుల్జార్ బేగం

కాకుమానులోని బాలికల హాస్టల్‌కు తాగునీటి వసతి కల్పనలో అధికారుల నిర్లక్ష్యంపై జెడ్పీటీసీ గుల్జార్ బేగం ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి ఇదే సమస్యపై పదే, పదే సమావేశాల్లో ప్రస్తావిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోనందుకు నిరసనగా ఆమె సమావేశం మధ్యలోనే వెళ్లిపోయారు. హాస్టల్లో తాగునీటి వసతి కోసం ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించినప్పటికీ అధికారులు పనులు చేపట్టకపోవడంపై హెనీ క్రిస్టినాతోపాటు సీఈవో జె. మోహనరావు అసంతృప్తి వ్యక్తం చేశారు.

సుదీర్ఘకాలం నాటి భూ సమస్యలకు పరిష్కారం



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్యే కోన రఘుపతి, జేసీ శ్రీధర్

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- 1401 మంది 614.2 ఎకరాల లంక భూములకు హక్కు పత్రాలు
- హర్షం వ్యక్తం చేసిన రైతులు

బాపట్ల : సుదీర్ఘ కాలంనాటి భూ సమస్యలన్నీ రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడంతోపాటు నిరుపేదలకు భూమి పంపిణీ చేస్తుందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. భూమి పంపిణీ, భూమి హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. ఏలూరు జిల్లా నూజివీడులో నిర్వహించిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై పేదలకు భూమి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని ప్రజలు తిలకించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతి కోసమే భూమి పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. బ్రిటిష్ కాలం నాటి సమస్యలకు సైతం ప్రభుత్వం పరిష్కార మార్గం చూపిందన్నారు. దశాబ్దాలుగా భూమి అనుభవిస్తున్న వారికే హక్కు పత్రాలను ప్రభుత్వం జారీ చేసిందన్నారు. భూమి లేని 1,023 మంది నిరుపేదలకు 790.43ఎకరాల అసైన్డ్ భూములను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అందులోనే 376 మంది ఎస్సీలకు 173.11 ఎకరాల భూమి, 90 మంది ఎస్టీలకు 64.46 ఎకరాలు, 43 మంది బీసీలకు 33.84 ఎకరాలు, 514 మంది ఓసీలకు 518.94 ఎకరాలను లబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. బాపట్ల జిల్లాలో 1,401 మందికి 614.12 ఎకరాల లంక భూములకు హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. దశాబ్దాలుగా నిషేధిత భూముల జాబితాలోని 518 మందికి చెందిన 561.64 ఎకరాల అసైన్డ్ భూములకు భూమి హక్కు పత్రాలను అందిస్తున్నట్లు వివరించారు. నిషేధిత భూముల జాబితా నుంచి అసైన్డ్ భూములను తొలగించడం, భూమిలేని నిరుపేదలకు పట్టాలు ఇవ్వడం, ఇనామ్ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించడం, ఎస్సీలకు శ్మశానవాటిక కోసం భూమి కేటాయింపులు చేయడం, లంక భూములకు పట్టాల పంపిణీలో భాగంగా బాపట్ల జిల్లాలో మొత్తం 3,342 మందికి 1966.20 ఎకరాల భూమిని పంపిణీ చేశామన్నారు.

స్థిరాస్తిని సమకూర్చిన ప్రభుత్వం ఎమ్మెల్యే కోన

భూమి లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం స్థిరాస్తిని సమకూర్చి ఇస్తుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల పక్షాన నిలిచి, వారి సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. పేదలకు భూమి పంపిణీ చేయడం కోసం అధికారులు ఎంతో శ్రమించి భూమి హక్కు పత్రాలను సిద్ధం చేశారని ప్రశంసించారు. దశాబ్దాలుగా భూమి అనుభవిస్తున్నప్పటికీ ఎలాంటి హక్కులు లేని నిరుపేదలకు సర్వహక్కులు కల్పిస్తూ పత్రాలను అందించడం అభినందనీయమన్నారు. లంక భూములకు రాష్ట్ర ముఖ్యమంత్రి పట్టాలు ఇవ్వడం సాహసోపేత నిర్ణయంగా ఆయన అభివర్ణించారు. ఆది ఆంధ్ర, నరసయ్యపాలెం సొసైటీలకు కింద లబ్ధిదారులకు భూమి హక్కు పత్రాలు అందజేయడం సంతోషదాయకమన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సీహెచ్ శ్రీధర్, డీఆర్వో పి.వెంకటరమణ, కలెక్టరేట్ ఏఓ కె.గోపికృష్ణ, బాపట్ల ఆర్డీఓ జి.రవీందర్, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



తెనాలి ఎంపీపీగా ధర్మరాజుల చెన్నకేశవరావు ప్రమాణస్వీకారం శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ఈ ఉత్సవానికి రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్యవరప్రసాదరావు, తెనాలి ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. - తెనాలి

నేటి నుంచి వెనిగండ్లలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

పెదకాకాని: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు వెనిగండ్లలో నిర్వహించనున్నట్లు పీఈటీ, పోటీల నిర్వాహక కమిటీ కార్యదర్శి బేరం మస్తాన్‌రెడ్డి, పాఠశాల హెచ్ఎం నంబూరు తిరుపతిరావు శుక్రవారం తెలిపారు. స్థానిక వేమన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో అండర్‌– 14 బాలబాలికల జట్లు పాల్గొంటాయని చెప్పారు. క్రీడాకారులు 13 జిల్లాల నుంచి సుమారు 480 మంది, 50 మంది కోచ్ మేనేజర్లు, 50 మంది జిల్లాలోని వ్యాయామ ఉపాధ్యాయులు హాజరవుతారని వివరించారు. మూడు రోజుల పాటు లీగ్ కం నాకౌట్ పద్ధతుల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ పోటీలను స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ప్రారంభిస్తారని చెప్పారు.





నాగేంద్రునికి విన్నపాలు

నాగుల చవితి సంబరాలు అంబరాన్నంటాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రజలు నాగేంద్రుడిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. పుట్టల వద్ద గంటల తరబడి బారులుతీరి పాలుపోసి ప్రత్యేక పూజలు చేశారు. విన్నపాలు మొరపెట్టారు. అమరావతి బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామి ఆలయంలోని నాగేంద్రునికి పుట్ట వద్ద భక్తులు అధికసంఖ్యలో పాలుపోశారు. తొలుత కృష్ణానదిలో కార్తీక పుణ్యస్నానాలు ఆచరించారు. ఉసిరిక చెట్టు వద్ద దీపాలు వెలిగించారు. అనంతరం అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరికి కుంకుమపూజలు చేశారు. – అమరావతి

లెక్కలు తేల్చేస్తున్నారు

- ఓటు దరఖాస్తుల పరిష్కారంలో ముందడుగు
- కలెక్టర్ నేతృత్వంలో వేగంగా పరిశీలన
- అంతే వేగంగా పరిష్కారం
- జిల్లావ్యాప్తంగా 1.31 లక్షల దరఖాస్తులు
- 1.14 లక్షల ఖినతులకు పరిష్కారం
- జిల్లాకు రాష్ట్రంలో రెండో స్థానం



జె.పంగులూరు మండలం కొండమూరులో ఓటర్ల జాబితాపై స్వయంగా విచారణ జరుపుతున్న కలెక్టర్ రంజిత్ బాషా(ఫైల్)

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ప్రతిపక్ష టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో జిల్లా వ్యాప్తంగా అత్యధికంగా దొంగ ఓట్లు నమోదు చేయించి ఎన్నికల్లో నెగ్గుకొస్తోందన్న ఆరోపణల నేపథ్యంలో జిల్లాలో ఓటర్ల నమోదు ప్రక్రియను అధికారులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. మరోవైపు దొంగ ఓట్ల వివరాలను స్థానికులతోపాటు పలువురు ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు ఎన్నికల అధికారులకు ఎప్పటికప్పుడు అందజేస్తున్నారు. ఇప్పటికే పర్చూరు నియోజకవర్గంలో అధికంగా దొంగ ఓట్లు ఉన్నాయని ఆ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఆమంచి కృష్ణమోహన్‌తో పాటు పలు నియోజకవర్గాలకు చెందిన నేతలు ఆధారాలతో సహా దొంగ ఓట్ల వివరాలను ఎన్నికల అధికారులకు అందజేశారు. ఎలాగోలా దొంగ ఓట్లను కాపాడుకునేందుకు ప్రతిపక్ష పార్టీ ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలు అధికారపార్టీపై తప్పుడు ఆరోపణలు చేయడమే కాకుండా న్యాయస్థానాలను సైతం ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఓటు నమోదు ప్రక్రియ వివాదాస్పదంగా మారింది. ఈ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా వేగంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం నడుంబిగించింది. జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా నేతృత్వంలో అధికారులు ఓటు నమోదు, తొగింపు, ఓటు బదిలీ తదితర వాటి కోసం వచ్చిన దరఖాస్తులను వడపోసి ఆయా విభాగాలకు పంపించి ప్రక్రియను మరింత వేగంగా ముగించేందుకు సత్వర చర్యలు చేపట్టారు. దొంగ ఓట్లను తొలగించాలంటూ వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఇతర ప్రాంతాల్లోని వారికి ఇక్కడ, అక్కడ ఓట్లు ఉండటం, నియోజకవర్గంలోనే ఒక్కరికి రెండు మూడుచోట్ల ఓట్లు ఉండడం, ఇతర రాష్ట్రాలతోపాటు జిల్లాలో కూడా ఓట్లు ఉండటం లాంటివి వేల సంఖ్యలో కనిపించాయి. దీంతో వీటిని తొలగించాలన్న డిమాండ్‌తో అధికారులు సమగ్ర విచారణ జరిపించాల్సి వచ్చింది. ఒకే విధమైన ఫొటోతో ఉన్న ఓట్లు 33 వేలకు పైగా ఉన్నట్లు తెలుస్తోంది. డబుల్ ఎంట్రీలు అధికంగా కనిపించాయి. దశాబ్దాలుగా వలసలు వెళ్లి ఎక్కడో స్థిరపడినవారి ఓట్లు ఇక్కడ ఉన్నాయి.

ఈ పరిస్థితిలో ప్రధానంగా దొంగ ఓట్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి తొలగింపునకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. వేలల్లో ఉన్న మృతుల ఓట్లు తొలగిస్తున్నారు. వినతుల ప్రక్రియ నిరంతరంగా మారడంతో ఎప్పటికప్పుడు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పూర్తిస్థాయి విచారణ చేపట్టి తదుపరి చర్యలకు సమయం పడుతోంది. సిబ్బంది కొరత కూడా ప్రక్రియ ఆలస్యానికి కారణమవుతోంది. ఈ నేపథ్యంలో ఈ మొత్తం ప్రక్రయకు మరింత సమయం అవసరమవుతుంది.

అత్యంత వేగంగా ప్రక్రియ...

జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా నేతృత్వంలో అధికారులు ఓట్ల నమోదు కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నారు. పైగా ఉన్నంతలో ప్రక్రియను వేగంగా చేస్తున్నారు. గత జనవరి నుంచి ఇప్పటివరకు 1,31,821 దరఖాస్తులు రాగా.. వేమూరు నియోజకవర్గం నుంచి 16,539 వచ్చాయి. రేపల్లె పరిధిలో 22,545, బాపట్లలో 17,921, పర్చూరులో 29, 188, అద్దంకిలో 25, 366, చీరాలలో 20, 262 చొప్పున దరఖాస్తులు ఉన్నాయి. ఇందులో ఓటు నమోదు కోసం 48,882, ఓట్ల తొలగింపు కోసం 41,976, ఓటు బదిలీ కోసం 40,963 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో ఇప్పటివరకు 1,14,682 దరఖాస్తులు క్లియర్ చేశారు. ఇంకా వేమూరు నియోజకవర్గంలో 1,119, రేపల్లెలో 2153, బాపట్లలో 1638, పర్చూరులో 5221, అద్దంకిలో 3306, చీరాలలో 3680 చొప్పున మొత్తం 17,117 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో మొత్తం ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా వచ్చిన వినతులను పరిశీలించడం, పరిష్కరించడంలో బాపట్ల జిల్లా రాష్ట్రంలో రెండో స్థానంలో ఉంది. అధికారుల కృషి వల్లే ఇది సాధ్యమైంది.

పారదర్శకంగా ఓటర్ల నమోదు ప్రక్రియ

జిల్లాలో ఓటర్ల నమోదు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోంది. ఓటు నమోదు, బదిలీ, తొలగింపుల కోసం వచ్చిన దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా తొలగింపు విషయంలో ఏ మాత్రం వివక్షకు తావులేకుండా క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవాలు పరిశీలించి నిర్ణయం తీసుకుంటున్నాం. సిమిలర్ ఫొటోలు, డబుల్ ఎంట్రీలు, డెత్‌లు ఇప్పటికే మా దృష్టికి వచ్చాయి. అటువంటి వాటిని నిబంధనల మేరకు తొలగిస్తున్నాం. మొత్తంగా ఓట్ల నమోదు ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తున్నాం.

– రంజిత్‌బాషా,
కలెక్టర్, బాపట్ల జిల్లా

ముగిసిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు

- అండర్–17 బాలుర విభాగంలో విజేత గుంటూరు, రన్నర్ శ్రీకాకుళం
- బాలికల విభాగంలో విన్నర్ ప్రకాశం, రన్నర్ విజయనగరం

పెదకాకాని: క్రీడాకారులు మంచి ప్రతిభ కనబరిచి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని డెప్యూటీ విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు చెప్పారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రారంభమైన మూడు రోజుల 67వ ఏపీ ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. అండర్–17 బాలబాలికల విభాగాలలో జరిగిన ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి 500 క్రీడాకారులు పాల్గొని ఉత్తమ ఆటతీరును ప్రదర్శించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా బాలుర జట్టు విజేతగా నిలవగా, రన్నర్‌గా శ్రీకాకుళం జట్టు నిలిచింది. విజయనగరం జట్టు తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. అలాగే అండర్–17 బాలికల విభాగంలో ప్రకాశం జిల్లా జట్టు విన్నర్ కాగా విజయనగరం జట్టు రన్నర్‌గా నిలిచింది. తృతీయ స్థానాన్ని శ్రీకాకుళం జట్టు దక్కించుకుంది. విజేతలకు పతకాలు బహూకరించడంతోపాటు సర్టిఫికెట్లు అందజేశారు. విన్నర్, రన్నర్ స్థానాల్లో నిలిచిన జట్లకు గోల్డ్‌కప్‌లు అందజేశారు.

సమస్య గులాబీ రంగు పురుగువల్లే!

- రైతులు సమష్టిగా నియంత్రణకు పూనుకోవాలి
- యాజమాన్య పద్ధతులతోనే నాణ్యమైన పత్తి దిగుబడి సాధ్యం
- కేంద్ర పత్తి పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ వై.జి.ప్రసాద్



క్షేత్రస్థాయిలో పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: దేశంలో పత్తి పండించే అన్ని రాష్ట్రాల్లో పత్తి పంటలో గులాబీ రంగు పురుగు తీవ్ర సమస్యగా మారిందనీ, రైతులందరూ సమిష్టిగా ఈ పురుగును నియంత్రించాలని కేంద్ర పత్తి పరిశోధన స్థానం డైరెక్టర్ డాక్టర్ వై.జి.ప్రసాద్ సూచించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 60 సంవత్సరాల సంబరాల్లో భాగంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం పత్తి విభాగం శాస్త్రవేత్తలు క్షేత్ర స్థాయి పరిశోధన దినోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం నిడుముక్కల గ్రామంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కేంద్ర పత్తి పరిశోధన ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక ప్రాంతంలోని రైతులందరూ పత్తి పంటను ఒకేసారి విత్తడం ద్వారా మాత్రమే ఈ పురుగును నివారించుకోవచ్చన్నారు. నాణ్యమైన పత్తిని పొందాలంటే మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగుల సమగ్ర యాజమాన్య పద్ధతుల్లో పీబీనాట్స్(ముడులు) వాడటం ద్వారా సంపర్కాన్ని నిరోధించి గులాబీరంగు పురుగుల ఉధృతిని తగ్గించవచ్చన్నారు. పీబీనాట్స్ వాడి పత్తి పొలాలను రైతులతో కలిసి సందర్శించారు. కార్యక్రమంలో లాంఫాం ఏడీఆర్ డాక్టర్ జీవీ ప్రసాదరావు, సౌత్ ఆసియా బయోటెక్నాలజీ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ భగీరథ్ చౌదరి, ప్రొఫెసర్ డాక్టర్ గోవింద్‌గుజర్, కాటన్ కార్పొరేషన్ డీడీఈ స్వప్నిత్, జిల్లా ఫిబినాట్స్ ప్రాజెక్ట్ ఇంచార్జ్ డాక్టర్ దయానా, ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ బి శ్రీలక్ష్మి, డాక్టర్ ఎం సుధారాణి, డాక్టర్ ఎస్ వెంకటలక్ష్మి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ కె శివారెడ్డి, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ రామ్‌మోహన్, వీపీపీ రవి, రైతులు తదితరులున్నారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా
- సముద్ర స్నానాలపై సమీక్ష

బాపట్ల: కార్తిక మాసం సందర్భంగా సముద్రతీరంలో స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్‌లోని స్పందన హాల్‌లో కార్తిక మాసంలో సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై జిల్లా కలెక్టర్ రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా మాట్లాడుతూ జిల్లాలో కార్తిక మాసంలో బాపట్ల సూర్యలంక, చీరాల ఓడరేవు, రామాపురం బీచ్‌ల్లో సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్తిక మాసం సందర్భంగా సోమవారం, కార్తిక పౌర్ణమి రోజుల్లో లక్షల్లో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. కార్తిక మాసం నేపథ్యంలో సముద్రం వద్ద పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భక్తులకు స్నానాలు చేయడానికి అవసరమైన సౌకర్యాలు కల్పించాలని గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులను ఆదేశించారు. సముద్ర స్నానాలకు వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, డీపీఓ దాసరి రాంబాబు, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్, ఆర్అండ్ బీ ఎస్ఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి

జిల్లాలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. కలెక్టరేట్‌లోని స్పందన హాలులో శుక్రవారం జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో మైక్రో ఇరిగేషన్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. తోటవారి పాలెం ఎత్తిపోతల పథకం కింద ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దశరథ మహారాజు, వ్యవసాయ శాఖ జేడీ అబ్దుల్ సత్తార్, పశుసంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు, మత్స్య శాఖ జేడీ సురేష్, ఉద్యాన శాఖ ఏడీ జెనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను అధికారులు గుర్తించాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జాతీయ రహదారిపై డ్రైవర్లకు రెస్ట్ ఏరియాలు ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. బాపట్ల- ఒంగోలు రహదారిపై ప్రమాదాలు జరగకుండా పోలీసు, రవాణాశాఖ అధికారులు పరిశీలించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేష్, జిల్లా రవాణా శాఖ అధికారి ఎ.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, ఆర్అండ్ బీ శాఖ ఎస్ఈ శ్రీనివాస్, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసన్నలక్ష్మి, అంకమ్మరావు, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి



గ్రంథాలయ రికార్డులు పరిశీలిస్తున్న ఆదిలక్ష్మి

కారంచేడు: జిల్లాలోని గ్రంథాలయాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె కారంచేడు మాస్కో బజారు వద్ద ఉన్న గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయాల వారోత్సవాల నిర్వహణపై ఆమె సమీక్షించారు. గ్రంథాలయానికి సంబంధించిన అన్ని రకాల రికార్డులను ఆమె పరిశీలించారు. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను గ్రామస్తులు, వ్యాపారులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు చక్కగా వినియోగించుకునేలా వారిలో అవగాహన కల్పించాలన్నారు. మహిళలు తీరిక వేళల్లో చదువుకోవడానికి వీలుగా ఉండేలా పుస్తకాలను ఇళ్లకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన పుస్తకాలను విద్యార్థులు డిపాజిట్ చేసి తీసుకెళ్లేలా అవగాహన కల్పించాలన్నారు. వారోత్సవాల్లో నిర్వహించే పోటీల్లో విజేతలకు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో బహుమతులు అందించాలని ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ నాగయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు కార్తికేయ ఎంపిక



బంగారు, వెండి పతకాలు సాధించిన పీతా కార్తికేయ, పీతా తనూష

నిజాంపట్నం: జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పీతా కార్తికేయ ఎంపిక కావడం హర్షణీయమని కోచ్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. భారత ప్రభుత్వంచే గుర్తింపు పొందిన స్టైర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల తైక్వాండో పోటీలు ఈనెల 14, 15 తేదీల్లో రేపల్లె బోధి ధర్మ జిమ్, తైక్వాండో అకాడమీలో జరిగాయి. పోటీల్లో గుంటూరు జిల్లా టీమ్ తరపున నిజాంపట్నంకు చెందిన పీతా కార్తికేయ బంగారు పతకాన్ని సాధించగా, పీతా తనూష వెండి పతకం సాధించింది. బంగారు పతకాన్ని సాధించిన పీతా కార్తికేయ నవంబర్ 30 నుంచి జరిగే జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన ఇద్దరు విద్యార్థినిలను రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు, ఆయన సోదరుడు మోపిదేవి హరనాథబాబు, బోటు ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, ఏపీ సీఫుడ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొలిశెట్టి రామకృష్ణ తదితరులు అభినందించారు.

సహకార రంగం ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తోంది

జిల్లా పీడీసీసీ బ్యాంక్ సహకారశాఖ ఆడిట్ అధికారి యలమందరావు



సభలో మాట్లాడుతున్న యలమందరావు

చీరాల రూరల్: సహకార రంగం ప్రపంచ వ్యాప్తంగా రోజురోజుకు విస్తరిస్తోందని జిల్లా పీడీసీసీ బ్యాంక్ సహకారశాఖ ఆడిట్ అధికారి యలమందరావు అన్నారు. స్థానిక పీడీసీసీ బ్యాంకు చీరాల శాఖ కార్యాలయంలో శుక్రవారం 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముందుగా వారోత్సవాల జెండా, సహకార ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సహకార రంగం రైతులకు, ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సహకార రంగం విశిష్టతను వివరించారు. చీరాల శాఖ మేనేజర్ వాసుదేవ్‌సింగ్ అధ్యక్షత వహించిన సభలో చీరాల ఆర్వో చీఫ్ మేనేజర్ నరసింహ, బాపట్ల జిల్లా ఆడిట్ ఆఫీస్ సూపరింటెండెంట్ కోటి వీరయ్య, చీరాల సబ్ డివిజన్ కో-ఆపరేటివ్ ఆఫీస్ పర్యవేక్షకుడు సుధాకర్, చీరాల పీడీసీసీ చైర్మన్ బోయిన కేశవులు తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూమిని స్వాధీనం చేసుకుంటాం

సహాయ కమిషనర్ పానకాలరావు



మాట్లాడుతున్న దేవదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావు

పర్చూరు (చినగంజాం): నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన 1774 ఎకరాల దేవదాయ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటామని దేవదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావు అన్నారు. రైతులకు నోటీసులు జారీ చేసి వారం రోజుల్లో స్వాధీనం చేసుకోనున్నట్లు ఆయన వివరించారు. శుక్రవారం స్థానిక దేవదాయ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 8196 ఎకరాలు మాన్యం భూమి ఉందన్నారు. దానితో పాటు ఆక్రమణకు గురైన భూమిని స్వాధీనం చేసుకొని మొత్తం భూమికి వేలం నిర్వహిస్తామని తెలిపారు. తమ రికార్డుల్లో నమోదు కాని మాన్యం భూమిని గురించిన సమాచారాన్ని తమకు ఇవ్వాల్సిందిగా ఆయన ప్రజలను కోరారు. కావున రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ కార్యదర్శులు ఎం శ్రీనివాసరావు, పీ శ్రీనివాసరావు, ఎం నాగయ్య, కోటిరెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై ఆర్డీవో విచారణ



బాధితులను విచారిస్తున్న ఆర్డీవో, డీఎంహెచ్‌వో

అద్దంకి రూరల్: వైద్యురాలి నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిన ఘటనపై అధికారులు విచారణ జరిపారు. ఇటీవల అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యురాలి నిర్లక్ష్యంతో బాలింత మృతి చెందిన ఘటనపై మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం చీరాల ఆర్డీవో సరోజిని స్థానిక వైద్యశాలలో విచారణ చేపట్టారు. వైద్యురాలు, ఫిర్యాదుదారుల నుంచి, వైద్యశాల సిబ్బంది నుంచి వివరాలు సేకరించారు. ఈ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. ఆర్డీవోతో విచారణకు వచ్చిన డీఎంహెచ్‌వో విజయలక్ష్మీకి ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు వైద్యురాలిపై ఫిర్యాదు చేస్తూ వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ జీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నర్సెస్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ షురూ

గుంటూరు మెడికల్: ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ఏపీ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ రి. నంబర్ 21/1973 ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. ఎన్నికల అధికారులు కర్నూల్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రధాన ఆచార్యులు ఎస్. జ్యోతి, గుంటూరు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఆచార్యులు పద్మావతి ఎన్నికల షెడ్యూల్ శుక్రవారం ప్రకటించారు. అక్టోబర్ నెలలో రాష్ట్ర వ్యాప్తంగా సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తయినట్లు తెలిపారు. అర్హత కలిగిన నర్సింగ్ అసోసియేషన్ సభ్యులందరూ నామినేషన్ ప్రక్రియలో పాల్గొనాలన్నారు. అసోసియేషన్ చట్ట ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఐదు సంవత్సరాల సభ్యత్వం 2024 జనవరి 1 నాటికి మూడు సంవత్సరాలు పదవి విరమణ తేదీనాటికి ఉన్నవారు ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులన్నారు. అర్హత కలిగిన నర్సింగ్ సిబ్బంది కింద తెలుపబడిన పదవులకు ఎన్నికల అధికారులకు నామినేషన్ దాఖల చేయాలన్నారు. అధ్యక్షులు-1, కార్యదర్శి-1, కోశాధికారి-1, జిల్లా ఎన్నికలు జరిగిన తర్వాత రాష్ట్ర ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు. జిల్లా ఎన్నికల నామినేషన్ తేదీ ఈనెల 25, ఎన్నికల తేదీ డిసెంబరు 13ని చెప్పారు.

ట్రావెల్స్ కారు అపహరణ

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం సీఆర్ కళాశాల సమీపంలోని ఆర్ఆర్ కార్ ట్రావెల్స్‌కు చెందిన కారు చోరీకి గురైంది. ఈ మేరకు ట్రావెల్ నిర్వాహకుడు వజ్జా బ్రహ్మయ్య శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి 11 గంటల సమయంలో కార్యాలయం మూసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం కారు ట్రావెల్స్ రాగా, కార్యాలయం తాళాలు పగలగొట్టి అందులో ఉన్న కారు తాళాలు తీసుకుని కారుతో ఉడాయించినట్లు గుర్తించాడు. సీసీ కెమెరాలకు సంబంధించిన టీవీ, రికార్డర్‌తో పాటూ మరో కలర్ టీవీ, సెల్‌ఫోన్ చార్జర్లు, రెయించీల కిట్‌ను కారులో పెట్టుకుని వెళ్లినట్లు గుర్తించారు. రాత్రి 12 గంటల సమయంలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారని బయట ఉన్న లైట్లు ఆపివేసి చోరీకి పాల్పడి ఉంటారని స్థానికులు చెబుతున్నారు. కారు విలువ సుమారు రూ.7 లక్షలు ఉంటుందన్నారు. చోరీకి గురైన సమయంలో అదే ఆవరణలో మరో మూడు కార్లు ఉన్నాయని, వాటి తాళాలు కూడా చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. గతంలో కూడా ఈ ట్రావెల్స్ ఎదురుగా ఉన్న మరో ట్రావెల్స్‌లో కూడా కారు చోరీకి గురి కాగా, కారుపైనున్న స్టిక్కర్ సాయంతో ఒంగోలులో గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

పథకాలపై విస్తృత ప్రచారం జరగాలి

కేంద్ర సంయుక్త కార్యదర్శి సోలమన్ ఆరోక్యరాజ్

గుంటూరువెస్ట్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేసేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నామని కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి సోలమన్ ఆరోక్యరాజ్ తెలిపారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామస్థాయిలో ప్రజలకు విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమం జనవరి 26వరకు నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమానికి నోడల్ అధికారిని నియమించాలనీ, కార్యక్రమ వివరాలు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని చెప్పారు. గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో 60 రోజుల్లో 258 గ్రామాలు, మున్సిపాలిటీల్లో 20 రోజుల్లో 40 ప్రాంతాల్లో సంకల్పయాత్ర నిర్వహించేలా రూట్ మ్యాప్ రూపొందించామన్నారు. జిల్లా స్థాయి అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించామని తెలిపారు. జిల్లాస్థాయి అధికారులుగా 37 మందితోనూ, మండలస్థాయి అధికారులు 17 మందితో మండల కమిటీలు ఏర్పాటుచేసి నిర్వహణ బాధ్యతలు అప్పగించామన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితోపాటు వలంటీర్లు పాల్గొనేలా చూస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. జేసీ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, పీఆర్ ఎస్ఈ బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త శాస్త్ర ప్రచార ఉద్యమాన్ని జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కోట వెంకటేశ్వరరెడ్డి

బాపట్లఅర్బన్: భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ పక్షోత్సవాలు ఈనెల 30 వరకు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం వెదుళ్లపల్లి చైతన్య భవనంలో జరిగిన సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం -ఎన్నికలు-ఓటరు చైతన్యం రానున్న 2024 ఎన్నికల్లో పలు ప్రాంతాలలో చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చెకుముకి సైన్స్ సంబరాలు, మండల స్థాయిలో జరిగే పోటీలను జయప్రదం చేయాలని కోరారు. ఊరూరా జన విజ్ఞానం ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు, కార్యక్రమాలను నిర్వహించేందుకు ఈనెల 19, 20 తేదీల్లో వెదుళ్లపల్లి గ్రామంలోని చైతన్య భవన్‌లో రెండు రోజులపాటు సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జన విజ్ఞాన వేదిక, ఘంటసాల చైతన్య వేదిక అభ్యుదయ భావాల వేదిక సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అమలాపురం వెంకటేశ్వర్లు, పిట్టు నాగిరెడ్డి, ఎస్.కె సుభాని, ఆసోది సుబ్బారెడ్డి, చిన్నపరెడ్డి శ్రీనివాస రెడ్డి, దుమ్మా శ్రీను కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్‌లో సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం

అదాలత్ చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేలు



అదాలత్‌లో సమస్యను వింటున్న చైర్మన్ ఇమ్మానుయేలు, సభ్యులు

నరసరావుపేట: విద్యుత్ అదాలత్ ద్వారా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతున్నట్లు ఏపీ విద్యుత్ వినియోగదారుల అదాలత్ చైర్మన్ ఎస్. విక్టర్ ఇమ్మానుయేలు తెలిపారు. ఏపీ మధ్యప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో సత్తెనపల్లి బస్టాండ్ సెంటర్‌లోని శ్రీవాసవీ కల్యాణ మండపంలో విద్యుత్ అదాలత్ శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. అధిక బిల్లులు, కాలిపోయిన మీటర్లు, సర్వీసులు ఇవ్వకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేయటం, కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్ల సమస్యలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు, వంగిపోయి ప్రమాదకరంగా మారిన విద్యుత్ పోల్స్ సమస్య పరిష్కరించటం జరుగుతుందని వివరించారు. ప్రతి ప్రాంతంలో ఇటువంటి అదాలత్‌లు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా పది కేసులను పరిష్కరించారు. సమస్యల పరిష్కారంలో సాంకేతిక సభ్యులు కె.వెంకటకృష్ణ, సభ్యులు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర సభ్యులు ఏ సునీత సహకరించారు. కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వై.ఏడుకొండలు, వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈలు సురేంద్ర, పవన్ పాల్గొన్నారు.

రైతులకు అవసరమైన ఎరువులు అందించాలి

- వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లు
- యడ్లపాడు ఆర్‌బీకేలో ఆకస్మిక తనిఖీ



యడ్లపాడులోని గోదాములో ఉన్న ఎరువుల నిల్వలను తనిఖీ చేస్తున్న అధికారులు

యడ్లపాడు: విత్తనం మొదలు పంట విక్రయం వరకు రైతులకు భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర వ్యవసాయ సచివాలయం(ఎరువుల విభాగం) డిప్యూటీ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు చెప్పారు. ఎరువులు తనిఖీ రాష్ట్ర అధికారుల బృందం శుక్రవారం యడ్లపాడు గ్రామాన్ని పరిశీలించారు. స్థానిక గ్రామ సచివాలయం- 1 పరిధిలోని ఆర్‌బీకేను ఆకస్మిక తనిఖీ చేశారు. తొలుత కియోస్కో ద్వారా నిర్వహించిన ఎరువుల లభ్యత, విక్రయాలు, ప్రస్తుతం అందుబాటులో నిల్వలు, అమ్మకాల రికార్డుల్లో వాటి నమోదు విషయాలను గురించి వీఏఓలను అడిగి తెలుసుకున్నారు. నేరుగా రైతుల ఖాతాలకు నగదు బదిలీ వర్తింపజేసే (డీబీటీ) ఆన్‌లైన్‌లోని జాబితాలను పరిశీలించారు. గోదాముల్లోని ప్రస్తుత ఎరువుల నిల్వ సరిచూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల పరిధిలో సీజన్ల వారీగా రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలకు అనుగుణంగా ఎరువులు అందించేలా చూడాలన్నారు. నిల్వల్లో వ్యత్యాసాలు లేకుండా ఎప్పటికప్పుడు రికార్డుల సక్రమంగా చూసుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులను సకాలంలో తెప్పించి వారికి అందించడంలో సిబ్బంది చొరవ చూపాలన్నారు. ఎరువులకు సంబంధించి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సచివాలయం(ఫర్టిలైజర్ సెక్షన్) ఏడీఏ రాజన్, ఏఓ జి.సురేష్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఏడీఏ సీహెచ్ రవికుమార్, యడ్లపాడు ఏఓ సీహెచ్ సరిత ఉన్నారు.